క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక బక్రీద్

కర్నూలు(సెంట్రల్): సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగృత పరిచి సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైనా హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతో ప్రవితంగా జరుపుకునే బక్రీదు పండుగ దాన గుణానికి, త్యాగానికి ప్రతీక అని తెలిపారు. జిల్లాలోని ముస్లింలు కుటుంబ సభ్యులతో ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ వారు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు (టౌన్) : బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు నగర మేయర్ బీవై రామయ్య, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కర్నూలు(సెంట్రల్): బక్రీద్ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరపుకోవాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు ఆదివారం ఓ ప్రకటనలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇతిహాసాలను గౌరవించాలి



సందేశమిస్తున్న ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు

కర్నూలు కల్చరల్: భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు పేర్కొన్నారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం నిర్వహించారు. హరినామ సంకీర్తనలతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై భయం భయం

మహానంది: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోకి చిరుత రావడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అటవీ శాఖ డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌డీఓ ప్రతాప్, సిబ్బంది ఆదివారం ఘటన స్థలానికి చేరుకొని చిరుత పాదముద్రలను సేకరించారు. వారు మాట్లాడుతూ అటవీ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత జాడ, కదలికలు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.

మహానందిలో భక్తుల సందడి



వృక్ష గణపతిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడు,మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా రుద్ర,బ్రహ్మ,విష్ణు గుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. మహానందీశ్వరుడి దంపతులకు రాత్రి ఏకాంత సేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానందీశ్వరుడిని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి పార్వతి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠ రాజు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

కౌలు వేలంలో పెరిగిన ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు గ్రామంలో కొలువైన శ్రీ కోదండరామ,ఈశ్వర,చెన్నకేశవస్వామి ఆలయాలకు చెందిన 5.17 ఎకరాలకు కౌలు వేలాల ద్వారా గతంలో రూ.70 వేలు రాగా ఈ ఏడాది రూ.73,500 వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఓంకార సిద్ధేరస్వామి దేవస్థానికి చెందిన 2.50 ఎకరాలకు గతేడాది రూ.49 వేలు రాగా ప్రస్తుతం రూ.85 వేలు వచ్చిందన్నారు. బీ.కోడూరులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన 51.53 ఎకరాలకు నిర్వహించిన కౌలు వేలం ద్వారా గత ఏడాది రూ.3,65,500 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.5.34 లక్షలు వచ్చినట్లు వివరించారు.



పండుగ సందడి.. కొనుగోళ్లతో కిక్కిరిసిన పూలబజార్ ప్రాంతం

ఈద్ ముబారక్

నగరంలో ఎక్కడ చూసినా బక్రీద్ పండుగ సందడి కనిపిస్తోంది. సేమియాలు, డ్రైఫ్రూట్స్, కొత్తబట్టలు, అలంకరణవస్తువుల కొనుగోళ్లతో ఆదివారం పాతబస్తీ కిటకిటలాడింది. ఖుర్బానీ ఇచ్చేందుకు పలువురు పొట్టేళ్లు కొనుగోలు చేశారు. హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా ముస్లింలు నేడు బక్రీద్‌ను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

– సాక్షి,ఫొటోగ్రాఫర్, కర్నూలు



సేమియా విక్రయాలు



నూతన వస్త్రాల కొనుగోలు దృశ్యం



నగరంలో పొట్టేళ్ల అమ్మకాలు



పాతబస్తీలో గాజులు కొనుగోలు చేస్తున్న ముస్లిం మహిళలు



డ్రైఫ్రూట్స్ అమ్మకాలు



కిటకిటలాడుతున్న మెహిందీ కోన్ల దుకాణం

మెడికల్ కాలేజీ అధికారులకు బెదిరింపు!

- మైదానాన్ని తెరవాలని హుకూం

కర్నూలు(హాస్పిటల్): తాజాగా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి మెడికల్ కాలేజీ అధికారులకు ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. కర్నూలు మెడికల్ కాలేజీ మైదానాన్ని తెరవాలని హుకూం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ మైదానంలో వాకర్స్‌కు అనుమతి నిరాకరిస్తూ కొన్ని సంవత్సరాలుగా కళాశాల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కళాశాల అభివృద్ధి కమిటీలో తీర్మానం చేశారు. వాకర్స్ పేరుతో కొందరు బయటి వ్యక్తులు వచ్చి అసాంఘిక చర్యలు పాల్పడుతున్నారు. అలాగే మైదానాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. పూర్వ విద్యార్థుల పేరిట జరిగే నిర్మాణాన్ని కూడా అడ్డుకున్నారు. ఎవ్వరికైనా అనుమతి ఇస్తే కళాశాల మైదానాన్ని క్రమంగా ఆక్రమించుకుంటారని కమిటీలో కొందరు అభిప్రాయపడినట్లు తెలిసింది. దీంతో కొన్ని సంవత్సరాల నుంచి కళాశాల మైదానానికి తాళం వేసి ఉంచారు. మైదానం తెరిచి ఉంచాలని గతంలోనూ పలువురు ప్రజాప్రతినిధులు అధికారులకు ఫోన్ చేసి చెప్పారు. వారికి వాస్తవ పరిస్థితి వివరించడంతో అధికారుల మాటకు విలువిచ్చారు. అయితే తాజాగా ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి మైదానం తెరవాలని, వాకర్స్‌కు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. మైదానం తెరవడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించినా సదరు ప్రజాప్రతినిధి వినలేదని తెలుస్తోంది. ముందు ఎప్పటి నుంచి తెరుస్తారో ఆ మాట మాత్రం చెప్పాలంటూ హూంకరించినట్లు సమాచారం. దీంతో తాము కమిటీతో చర్చించి చెబుతామంటూ అధికారులు తేల్చి చెప్పినట్లు తెలిసింది.

పూల సాగును ప్రోత్సహించండి

- సంప్రదాయ పంటల స్థానంలో పూల సాగులో రాణించవచ్చు
- డిమాండ్, మార్కెటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పూల సాగు చేపట్టాలి
- ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడు సూచనలు



మాట్లాడుతున్న మధన్‌మోహన్‌గౌడు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పూలతోటల అభివృద్ధికి చక్కటి అవకాశాలు ఉన్నాయని, సంప్రదాయ పంటల స్థానంలో పండ్లతోటల సాగును ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని ఉద్యాన అధికారి మధన్‌మోహన్‌గౌడ్ ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి పాల్గొని పూల తోటల అభివృద్ధి ఆవశ్యకతను వివరించారు. పూల తోటల్లో ముఖ్యంగా చామంతి, మల్లె, కనకాంబరాలు, బంతిపూలు సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూల సాగులో పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తుంటారని, వారికి పూల సాగుపై అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్ దృష్టిలో ఉంచుకొని పూల సాగు చేపట్టాలని తెలిపారు. పూల తోటలకు ప్రధానంగా సూక్ష్మపోషకాల లోపాలు ఎక్కువగా కనబడుతాయని, మొగ్గదశలో బోరాన్, మెగ్నీషియం పిచికారీ చేస్తే పూల దిగుబడి పెరుగుతుందని, తద్వారా రైతులకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ...నేడున్న పరిస్థితుల్లో సంప్రదాయ పంటలు కలసి రావడం లేదని, ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు.ఉద్యాన పంటల్లో పూలతోటల సాగు బాగా కలసి వస్తుందని తెలిపారు. పూల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు కూడా ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

దూదేకుల సంక్షేమానికి కృషి చేస్తా

కర్నూలు : ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన కర్నూలు జిల్లా దూదేకుల సంఘానికి అన్ని విధాలా అండగా ఉంటూ సహకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. మంత్రి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను జిల్లా దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, జిల్లా కార్యదర్శి సిద్దయ్య తదితరులు టీజీ ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దూదేకుల కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.



మంత్రి టీజీ భరత్‌కు శాలువా కప్పి బొకే అందజేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

స్పోర్ట్స్



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలని కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డేను పురస్కరించుకొని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ తైక్వాండో క్రీడ వల్ల శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలకు తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, న్యాయవాది శ్రీధర్, యుఆర్‌బీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఊట్ల రమేష్‌బాబు, క్రైడాయి అధ్యక్షుడు సాయిరాం రెడ్డి, బ్రిజేష్ సింగ్ మాస్టర్లు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరం – గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్) : శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమావేశ హాలులో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా క్రీడలను ఎంచుకోవాలన్నారు. తద్వారా చదువులోనూ రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు వెంకటేష్ పాల్గొన్నారు.

22న కర్నూలులో 'ఒలింపిక్' పరుగు

కర్నూలు (టౌన్): నగరంలో ఈ నెల 22వ తేదీన ఒలింపిక్ డే పరుగు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఆదివారం ఒలింపిక్ సంఘం, క్రీడా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన స్విమ్మింగ్ పూల్‌లో అంతర్ పాఠశాలల స్విమ్మింగ్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయనతో పాటు క్రైడాయి ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, బ్రిజేష్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒలింపిక్ డే సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. క్రీడా పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అదికారి భూపతిరావు, స్విమ్మింగ్ శిక్షకులు నటరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో...

స్థానిక పెద్ద మార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఉషూ పోటీలు నిర్వహించారు. పోటీలను ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా అన్ని క్రీడాంశాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు లారీ హమాలీ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైనా టీడీపీ ప్రభుత్వం హమాలీ వర్కర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికుల హక్కుల కోసం సమగ్రమైన చట్టం తీసుకురావాలన్నారు. హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, రూ.10 లక్షల బీమా సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డు నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా టి.రాముడు, అధ్యక్ష,కార్యదర్శులుగా ఎం.వెంకటేశ్వర్లు, యు.బీసన్న, ఉపాధ్యక్షుడిగా కె.కేశవులు, సహాయ కార్యదర్శిగా కె.మధు, ట్రేజరర్‌గా బీకే రామకృష్ణ, సభ్యులుగా బి.నాగన్న, కె.కృష్ణ, శ్రీనివాసులు, ముత్తయ్య, యోహాన్, కోదండరాముడు, ఎల్లప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ న్యూసిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా పాల్గొన్నారు.

వైవిధ్యమైన కవితా శిల్పం 'బాల్యమే శరణార్థి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: వైవిధ్యమైన కవితా శిల్పంతో 'బాల్యమే శరణార్థి' పుస్తకాన్ని కవి రత్నం యేసేపు రచించారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఉద్యగ క్రాంతి ప్రచురణల ఆధ్వర్యంలో బాల్యమే శరణార్థి పుస్తకావిష్కరణ సభ ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషిని, సమాజాన్ని చదవలేని జ్ఞానం విజ్ఞానం కాదని, మనిషిలోని మనస్సుని, మానవీయతను వెలికి తీయని పాఠం శాస్త్రీయం కాదని కవి తన కవిత్వంలో చెప్పారన్నారు. సామాజిక స్పృహలేని ఉపాధ్యాయులు ఈ సమాజంలో ఉన్నారని చెబుతూనే పిల్లలు ఈ సమాజంలో బతక గలిగే పాఠాలు నేర్పేవాళ్లు కావాలన్నారు. కేఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విరసం నాయకులు పాణి, నాగేశ్వరాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి సంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, యూటీఎఫ్ నాయకులు రాములు, రాయలసీమ మేధావుల సంఘం నాయకులు రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

కోడుమూరు రూరల్: కోడుమూరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కోడుమూరులోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంతో మాట్లాడి వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను సాధించి జిల్లా రైతులకు సాగునీటినందిస్తామన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటుకు స్థలదాతలు ముందుకొస్తే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి కోడుమూరు ప్రజలకు శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకుముందు.. డోన్ ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా కోడుమూరుకు విచ్చేసిన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన శ్రీశైలం ఈఓ

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా నియమితులైన ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వేదాశీర్వచనంతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డు ప్రసాదం అందజేశారు. అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాభవానీ జయంత్యుత్సవాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ గంగాభవానీదేవి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహా మంగళహారతి నిర్వహించారు. తుంగభద్ర నుంచి తెచ్చిన నీటితో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వాహనంలో ఉంచి ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొనగా డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని లక్ష్మమ్మవ్వ ఆలయానికి చేరి అమ్మవారికి పూజలు నిర్వహించి తిరిగి అదే ప్రధాన రహదారుల్లో ఊరేగింపుగా గంగాభవానీ ఆలయంకు చేరుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఊరేగింపులో జై గంగాభవానీ నామస్మరణ మార్మోగింది. భక్తులు ఎరుపు జెండాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు, కుల పెద్దలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు పరిశీలన

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా క్రస్ట్ గేట్లు, జీడీపీలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ప్రస్తుతం జీడీపీలో ఉన్న నీటి నిల్వ, జీడీపీ సామర్థ్యం, ఆనకట్టు ఎత్తు పెంచే పనులను, జీడీపీకి రావాల్సిన నీటి వాటా, నిధులు తదితర వాటిని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.



- వేగంగా టన్నెల్ పనులు

చెన్నై - సూరత్ జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కర్నూలు నగర శివారులోని 44వ జాతీయ రహదారి రింగ్ రోడ్డు దగ్గర టన్నెల్ పనులు జోరుగా సాగుతున్నాయి. - కల్లూరు

నగరంలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు: బక్రీద్ పండును పురస్కరించుకొని సోమవారం కర్నూలు నగరంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ పి.గౌతమి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ముస్లిం సోదరులు ప్రార్థన చేసుకోడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సోమవారం ఉదయం 6 గంటల నుంచి ప్రార్థనలు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను తుంగభద్ర బ్రిడ్జి వద్ద నుంచి తిప్పమ్మ కొట్టం నుంచి జాతీయ రహదారిపై వెళ్లేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బళ్లారి చౌరస్తా మీదుగా గుత్తి పెట్రోల్ బంక్ బిర్లా జంక్షన్, సీక్యాంప్ మీదుగా నంద్యాల, నందికొట్కూరు వైపు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నంద్యాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మద్దూరు నగర్, బిర్లా జంక్షన్, గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు పోలీసులకు సహకరించాలని కోరారు.